కమ్ముకొస్తున్న మబ్బులు

- అన్నదాతల్లో ఆందోళన
- వర్షాలు పడితే భారీ నష్టం
- కొనుగోలు కేంద్రాలు ప్రారంభించని అధికారులు


రైతులు ఆరబెట్టిన ధాన్యం


కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట

దౌల్తాబాద్: కమ్ముకొస్తున్న మబ్బులు రైతన్నల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి మండలంలో అక్కడక్కడ వర్షం పడింది. పంట చేతికొచ్చే దశలో వర్షం భయం రైతులకు కంటి మీద కునుకులేకుండా పోతోంది. వరికోతలు కోసిన రైతులు వెంటవెంటనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ సమయంలో వర్షాలు పడితే రైతులకు కోలుకోలేని నష్టం వాటిల్లే ప్రమాదముందని చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు ప్రతి ఏటా నష్టపోతూనే ఉన్నారు. ప్రస్తుతం పంటను కోసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ధాన్యాన్ని పొలాల వద్ద ఇళ్ల వద్ద రోడ్లపై ఆరబెడుతున్నారు. మండలంలో సుమారు 8వేల ఎకరాల్లో వరిసాగయినట్లు అధికారులు చెబుతున్నారు. పక్షం రోజులైతే గానీ పంట పూర్తిస్థాయిలో చేతికొచ్చే పరిస్థితి లేదు. మబ్బుల కారణంగా రైతులు తీవ్ర ఆందోళన చెందుతూ దేవుడా కరుణించమని వరుణ దేవుడిని వేడుకుంటున్నారు.

మబ్బులతో గుబులు



రెండు ఎకరాల్లో వరిపంట సాగు చేశా. రెండు రోజుల్లో కోత ఉంది. మిషన్లు దొరకడంలేదు. మబ్బులు కమ్ముకొస్తుండటంతో భయంగా ఉంది. కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించలేదు. వెంటనే ప్రారంభించాలి. వర్షాలు వస్తే తీవ్ర నష్టం జరుగుతోంది.

–సత్యయ్య, రైతు, దౌల్తాబాద్

యథేచ్ఛగా అడవుల నరికివేత

- రేంజ్ పరిధిలోని బాణాపూర్‌లో ఘటన
- చర్యలు తీసుకుంటాం.. రేంజ్ అధికారి కృష్ణ

ధారూరు: 27 ఎకరాల్లో అడవిని నరికినా ఫారెస్టు అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలోని బాణాపూర్ ఫారెస్టులో బుధవారం ఈ ఘటన వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. జుంటుపల్లి సెక్షన్ పరిధిలోని బాణాపూర్ అడవిలో దాదాపు 20 మంది వ్యక్తులు అడవిని నరుకుతూ వచ్చారు. అడవిలోని మద్ది, చిరుమన్, నెమలినార, ఇప్ప, అల్లనేరేడు, సీక్రేన్ తదితర అడవి జాతుల చెట్లను యథేచ్ఛగా నరికి ఎట్టాలు వేసుకున్నారు. ఎట్టాలు వేసిన భూమి తమదే అంటూ హద్దులు పాతుకున్నారు. అడవిని నరికివేసి భూకబ్జాకు పాల్పడిన వ్యక్తుల గురించి తెలిసిన అధికార పార్టీ నేతల ఆదేశాలతో అధికారులు మిన్నకున్నట్లు తెలిసింది. పోడు భూములకు పట్టాలిస్తున్నారనే వినికిడితో వారు నరికివేతకు పాల్పడినట్లు తెలిసింది. ఇదే రేంజ్‌లో ఇంతకుముందు కూడా గురుదోట్ల, అంపల్లి, ఇతర అడవికి దగ్గరగా ఉన్న వారు చెట్ల నరికివేతను కొనసాగించారు. వీరికి పట్టాలు రాకున్నా పోడు భూముల పేరిట పట్టాలివ్వాలని డిమాండు చేస్తున్నారు.

సర్పంచు, ఉప సర్పంచు అడ్డుకుంటున్నారు: ఇన్‌చార్జి రేంజర్ కృష్ణ

పక్క పొలాల రైతులే అడవిని నరికి కబ్జా చేసినట్లు తెలిసింది. వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తే అధికార పార్టీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు అడ్డుకుంటున్నారు. ఎన్నికల వేళ తమకు ఎవరు సహకరించడం లేదు. గురువారం జేసీబీలతో కబ్జా భూముల్లో గుంతలు తవ్వించి చెట్లు నాటుతాం. ఎన్నికలు ముగిసిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అడవిని ఎవరు నరికిన కఠిన చర్యలు తప్పవు.


ధారూరు: బాణాపూర్ ఈస్ట్ అడవి

క్లుప్తంగా

రైస్‌మిల్లుల్లో ఎక్సైజ్ సోదాలు


సోదాలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

తాండూరు: ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు అక్రమ మద్యం నిల్వలపై తనిఖీలు చేస్తున్నారు. బుధవారం తాండూరు ఎక్సైజ్ శాఖ సీఐ అనంతయ్య ఆధ్వర్యంలో యాలాల మండలంలోని రైస్ మిల్లుల, దాల్‌మిల్లులు, ఫామ్ హౌజ్‌ల్లో సోదాలు చేశారు. తాండూరులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్‌రెడ్డికి చెందిన రైస్‌మిల్లు ఉండటంతో ఎక్సైజ్ అధికారుల తనిఖీలకు ప్రాధాన్యం సంతరించుకుంది. సోదాల్లో ఎలాంటి మద్యం అక్రమ నిల్వలు లభించలేదు. ఎన్నికల్లో భాగంగానే సోదాలు చేశామని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

డిసెంబర్ 5 నుంచి ధారూరు ఉత్సవాలు


మాట్లాడుతున్న దయానంద్

అనంతగిరి: ధారూరు క్రిస్టియన్ 101వ జాతర ఉత్సవాలను డిసెంబర్ 5 నుంచి 10వరకు నిర్వహిస్తున్నట్లు జాతర ఉత్సవాల కార్యదర్శి రెవరెండ్ సీ.జీ.దయానంద్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నవంబర్ మాసంలో జాతర ఉత్సవాలను నిర్వహించేవారమన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వాధికారుల సూచన మేరకు జాతరను డిసెంబర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్రలోని క్రైస్తవ సోదరులు ఈ విషయాన్ని గమనించి డిసెంబర్ 5నుంచి జరిగే ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

గంజాయి పట్టివేత

పరిగి: అక్రమంగా గంజాయి తరలిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ చౌరస్తాలో ఓ యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసున్నారు. యువకుడిని విచారించగా సిద్దులూరు గ్రామం వికారాబాద్ మండలమని తెలిపారు. యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మళ్లీ గోసపడతాం

డీసీసీ కార్యదర్శి సాయి ముదిరాజ్


ప్రచారం చేస్తున్న సాయిముదిరాజ్

కుల్కచర్ల: మోసపూరిత మాటలు నమ్మి అధికార పార్టీకి ఓటేస్తే మళ్లీ గోసపడతామని డీసీసీ కార్యదర్శి సాయి ముదిరాజ్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించి ఓట్లేయించుకునేందుకు ఎత్తులు వేస్తున్నారన్నారు. గృహలక్ష్మి, దళితబంధు పథకాల పేరు చెప్పి నిరుపేదలను మోసగించి కేవలం తమ పార్టీ వారికే ఇస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కేశవులు, మల్లేష్, చంద్రశేఖర్, బుచ్చయ్య, పుల్లప్ప, సంటి యాదయ్య, యాదయ్య పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

250 లీటర్ల బెల్లం, 12 లీటర్ల నాటు సారాస్వాధీనం


పోలీసులు అదుపులో ఛవాన్ రాంజీ

పెద్దేముల్: నాటుసారా స్థావరాలపై బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్, పెద్దేముల్ పోలీసులు దాడులు చేశారు. పెద్దేముల్ ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాలు.. తట్టెపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో స్థావరాలపై దాడులు చేపట్టారు. 250 లీటర్ల బెల్లం, 12 లీటర్ల నాటు సారాతో పాటు ముడి సరుకును సీజ్ చేసి, తయారీ వస్తువులను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న ఛవాన్ రాంజీతో పాటు మరోకరిని అదుపులో తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ దాడులను తిప్పి కొడతాం


మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

కొడంగల్ : నియోజకవర్గంలో ప్రజలు మా కుటుంబానికి అండగా ఉన్నారని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి కొడంగల్ చరిత్ర తెలియదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని రేవంత్ నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దౌర్జన్యాలకు దాడులకు పాల్పడుతున్న నరేందర్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే సెక్యూరిటీ లేకుండా నియోజకవర్గంలో తిరగాలన్నారు. కొడంగల్ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మంత్రి మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిలు పోలీసుల సహకారంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకునేది లేదన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని రావులపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ సాయమ్మను పరామర్శించడానికి ఆమె ఇంటికి వెళ్తే ఎమ్మెల్యే అనుచరులు దాడులు చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. సాయమ్మ ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని గ్రామానికి వచ్చిందన్నారు. రావులపల్లి తమ సొంత ఊరు కావున ఆమెను పలకరించడానికి వెళ్లినట్లు తెలిపారు. మా సోదరుడు ప్రస్తుతం ఆ గ్రామ సర్పంచ్ రమేష్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడి చేసినట్లు తెలిపారు. ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. గత ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి మా కుటుంబం పంచన చేరి గెలిపించాలని కోరితే కొడంగల్ ప్రజలతో ఓట్లు వేయించి ఎమ్మెల్యేను చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యేను చేస్తే మా కుటుంబ సభ్యులపై దాడులు చేస్తూ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. 2018లో ఆయనకు తాము మద్దతు ఇచ్చినప్పుడు ఎంత ఇచ్చారో చెప్పాలన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి దగ్గర డబ్బులు తీసుకున్నామని చెప్పడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, మండల పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మాజీ జెడ్పీటీసీ ఏన్గుల భాస్కర్, కౌన్సిలర్ శంకర్‌నాయక్, నర్సింహ్మారెడ్డి, ఎస్ఎమ్ గౌసన్, నయీమ్, సోమశేఖర్, ఆసీఫ్‌ఖాన్, సంజీవ రెడ్డి, దాము, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రమాణాలను పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న హరిశ్చందర్

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థి ప్రమాణాలు, సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. బుధవారం మండలంలోని కిష్టాపూర్ పాఠశాలలో అయా పాఠశాలల ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హరిశ్చందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రాథమిక విద్య ప్రమాణాలు మెరుగుపర్చడం, విద్యార్థులకు చదవడం, రాయడం సులభతరంగా వచ్చేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి నెల విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి, ఫలితాల ఆధారంగా బోధన చేపట్టాలన్నారు. ఎఫ్ఏ1, ఎఫ్ఏ2, ఎస్ఏ1 పూర్తి చేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో రికార్డులకు సంబంధించి యూడైస్ సంఖ్యను సరిపోల్చాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మం కోసం నిరంతరం కృషి

కుల్కచర్ల: అవకాశవాద రాజకీయాలకు విరుద్ధంగా దేశం కోసం ధర్మం కోసం బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని ఆ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి మారుతి కిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీపాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి రహితపాలన కోసం బీజేపీ పనిచేస్తుందన్నారు. నిరంకుశ విధానంతో పాలిస్తున్న బీఆర్‌ఎస్ పాలనకు విముక్తి పలికేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైపాల్, ప్రధాన కార్యదర్శులు హన్మంతు, నర్సింహారెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటయ్య, అంజనేయులు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత పాలన ఎలా ఉందో ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బసిరెడ్డి, రంగాపూర్, పేటమాధారం, పోల్కపల్లి, నర్సయ్యగూడ, ఖుదావన్‌పూర్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేశారని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారని కాని నేడు గ్రామాలు పట్టణాలుగా మారాయన్నారు. మళ్లీ ఇదే పరిపాలన రావాలన్న, ఇవే సంక్షేమాలు కొనసాగాలన్నా బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ సీఎం కేసీఆర్ వైపే ఉన్నారని, కేసీఆర్ పాలనను మళ్లీ కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, ఎంపీటీసీ రవికుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.


ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు


ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

కారు గుర్తుకు ఓటేద్దాం

కుల్కచర్ల: కారు గుర్తుకు ఓటేస్తే దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు పొందవచ్చని చౌడాపూర్ మండల బీఆర్‌ఎస్ నాయకులు మఠం రాజశేఖర్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలంలోని మందిపల్ గ్రామంలో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్న సంకల్పంతో అత్యుత్తమైన సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వృద్ధుల వద్దకు వెళ్లి కారు గుర్తుపై నొక్కాలంటూ వారికి వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయం

దౌల్తాబాద్: కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నందారం, ఈర్లపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందించిందన్నారు. 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, వైస్ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తదితరులున్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం

దౌల్తాబాద్: మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం జెడ్పీటీసీ మహిపాల్ ఆధ్వర్యంలో గోకఫసల్‌వాద్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి గెలిచిన ఐదేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేశవరెడ్డి, మాజీసర్పంచ్ గోపాల్, అనంతయ్య తదితరులున్నారు.

జిల్లాలో 15 నామినేషన్లు దాఖలు

తాండూరు టౌన్ : తాండూరు అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా బుధవారం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పైలట్ రోహిత్‌రెడ్డి బుధవారం తొలిసెట్ నామినేషన్ దాఖలు చేశారు. నేడు అభిమానులు, కార్యకర్తల మధ్య భారీ ర్యాలీగా మరోసారి నామినేషన్ వేయనున్నారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. అలయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫామ్స్ పార్టీ తరపున పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన పి.అజయ్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయడం విశేషం. అలాగే బషీరాబాద్ మండలం బోజ్యానాయక్ తండాకు చెందిన మాన్యా, యాలాల మండలం పగిడియాల్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల ఆనంద్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్‌లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావుకు అందజేశారు.

కొడంగల్‌లో మూడు నామినేషన్లు

కొడంగల్ : కొడంగల్ అసెంబ్లీ స్థానానికి బుధవారం మూడు నామినేషన్ సెట్లు దాఖలైనట్లు రిటరి్నంగ్ అధికారి లింగ్యానాయక్ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా కొండెటి వెంకట్రాములు, కూర వెంకటయ్య, బీజేపీ అభ్యర్థి రమేష్ తరపున సౌజన్య నామినేషన్ పత్రాలు సమర్పించారు.

వికారాబాద్‌లో 7 నామినేషన్‌లు దాఖలు

అనంతగిరి: వికారాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో బుధవారం 7 సెట్ల నామినేషన్‌లు దాఖలయ్యాయని అధికారులు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఇతర ముఖ్యనాయకులతో కలిసి రెండు సెట్ల నామినేషన్‌లు దాఖలు చేశారు. అలాగే, ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ సబితానంద్ కూడా రెండు సెట్ల నామినేషన్‌లు దాఖలు చేశారు. బీఎస్పీ నుంచి జి.క్రాంతికుమార్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ధర్మసమాజ్ పార్టీ తరఫున జి.రవీందర్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ప్రజావెలుగు పార్టీ తరఫున ఎస్.గోపాల్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు వారు తెలిపారు. బుధవారం మంచి రోజు కావడంతో నేతలంతా సాదాసీదాగా నామినేషన్‌లు దాఖలు చేశారు. 10న భారీ జన సమీకరణతో మరో సెట్ నామినేషన్‌లు వేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటున్నారు.

మనోహర్‌రెడ్డిని గెలిపించండి


యాలాల: ప్రచారం నిర్వహిస్తున్న అమృతప్ప


వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్న నాయకులు


తాండూరు రూరల్: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాగప్ప, తదితరులు

తాండూరు రూరల్: కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గౌతపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగప్ప మాట్లాడుతూ.. గౌతపూర్‌లో కాంగ్రెస్‌కు ప్రజాదరణ ఉందన్నారు. రాష్ట్రంతో పాటు తాండూరులో కాంగ్రెస్ గాలి వీస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రారెడ్డి, జైపాల్, శ్రీనివాస్,మల్లేశంలు పాల్గొన్నారు.

యాలాల నుంచి భారీ మెజార్టీ ఇస్తాం

యాలాల: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్‌రెడ్డికి యాలాల మండలం నుంచి భారీ మెజార్టీ ఇస్తామని ఆ పార్టీ బీసీ సంఘం మండల అధ్యక్షుడు అమృతప్ప ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి, పేర్కంపల్లి తదితర గ్రామాల్లో గ్రామ సీనియర్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్న ఆరు గ్యారంటీ పథకాలను తప్పక అమలు చేస్తుందన్నారు. మనోహర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నేతలు, మాజీ ఎంపీటీసీ రాజు, రఘురాంరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మొగులప్ప, బీటీ రాములు, శంకర్, ఎల్లప్ప తదితరులు ఉన్నారు.

తట్టెపల్లిలో ప్రచారం

పెద్దేముల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. మండలంలోని తట్టెపల్లిలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాజిద్ ఇంటింటికి వెళ్లి తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. వంట చేస్తున్న మహిళల వద్దకు వెళ్లి అప్యాయంగా పలకరించి ప్రచారం సాగించారు.

రోడ్లు బాగుచేసి ఓట్లు అడుగు

ధారూరు: ఎమ్మెల్యే సొంత గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ దాతల సహాయంతో అభివృద్ధి చేయించారని, ఎమ్మెల్యేగా ఎక్కడ అభివృద్ధి పనులు చేయించావో చెబుతావా అంటూ ఎమ్మెల్యే ఆనంద్‌కు జిల్లా కాంగ్రెస్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ పటోళ్ల రాములు సవాల్ విసిరారు. బుధవారం సాయంత్రం ఆయన పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులతో కలిసి ధారూరు మండలంలోని నాగసమందర్‌లో ఇంటింటి ప్రచారం చేసి చేయి గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..నాగసమందర్ నుంచి అల్లాపూర్ గ్రామానికి వెళ్లె ప్రధాన రోడ్డు మురికికూపంగా మారిందని ఆరోపించారు. అభివృద్ధి చేయకుండానే ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ఎవరో డబ్బులిస్తే నిర్మించిన సీసీ రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి కనీస ఇంగిత జ్ఞానం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు లాల్ మహ్మద్, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

అవ్వా మీ కాళ్లు మొక్కుతాం

వికారాబాద్ అర్బన్: అవ్వా మాకు ఉద్యోగాలు రావాలన్నా, మన బతుకులు మారాలన్నా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి.. మీ కాళ్లు మొక్కుతామంటూ డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు ఇంటింటికి తిరిగి వృద్ధులను వేడుకుంటున్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్, రాజీవ్‌గృహకల్ప, ఇందిరానగర్ కాలనీల్లో కాంగ్రెస్ తరపున డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు రాములు, బసప్ప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ సీఎం అయ్యాక మా బతుకులు ఆగమయ్యాయని, ఉద్యోగాలు లేక రోడ్లపై తిరుగుతున్నామని వివరించారు.

గ్యారంటీలు నచ్చే పార్టీలో చేరిక

పరిగి: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు నమ్మి ఇతర పార్టీ నాయకులు, ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని టీఆర్ఆర్ నివాసంలో దోమ మండలంలోని దోర్నాల్‌పల్లి సర్పంచ్ యాదయ్యసాగర్, మైలారం సర్పంచ్ రాజు, బొంపల్లి సర్పంచ్ సురేష్, గొడుగోనిపల్లి సర్పంచ్ అమృతమ్మ, కిష్టాపూర్ సర్పంచ్ సత్యమ్మ, పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు గోపాల్, ఆయా మండలాల నుంచి భారీ సంఖ్యలో పార్టీలో చేరారు. అనంతరం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గ్రామాలకు చేసింది ఏమి లేదన్నారు. గ్రామాలకు ప్రభుత్వం నిధులు ఇస్తుందో లేదో సర్పంచ్‌లందరికి తెలుసన్నారు. ఎంతో మంది సర్పంచ్‌లు హామీలను నెరవేర్చేందుకు అప్పులు చేసి పనులు చేస్తే బిల్లులు రాక ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. అంతేకాక ఎక్కడ చూసినా కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో దోమ ఎంపీపీ అనసూయ, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్గయాదయ్యగౌడ్, రాఘవేందర్‌గౌడ్, ఆంజనేయులు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.